
కథ


# ఈ దేశం - ఈ ప్రజలు

రామాచంద్రమౌళి

ఎక్కడినుండొచ్చిందో ఊరకుక్క.. సింహంలాంటి ఊరకుక్క... చటుక్కున ఎగబడి భారతదేశంపై బడింది. దానివెంట మరో కుక్క.. వెనుకనే  ఇంకొకటి.. ఊరకుక్కల మంద.. అన్నీ కలగలిసి ఆ భారతదేశ వినైల్ హోర్డింగ్‌పై దాడిచేసి రెండు క్షణాల్లో ముక్కలు ముక్కలు చేశాయి. ముక్కలు చేస్తూ... ఒకటే మొరుగుడు.. కలబడుడు.. కుమ్ముకోవడాలు.. కుక్కల గోల అప్పటిదాకా ఎయిర్‌టెల్ అడ్వర్టయిజ్ మెంట్ హోర్డింగ్ కట్టే ప్రయత్నం చేస్తున్న చీమిడి ముక్కు కూలీ శివుడు కుక్క పైకి ఎగబడగానే భయంతో బేనర్ పారేసి పారి పోయాడు.



Story



'హోర్డింగ్‌పైన' దేశంలోకెల్లా అతిపెద్ద నెట్‌వర్క్ అన్న అక్షరాలు.. భారతదేశం పటం.. అన్నీ ముక్కలు ముక్కలైపోయాయి. ఎందుకో కుక్కలు వాట్లో అవే సంకీర్ణ ప్రభుత్వంలో కోట్ల రూపాయల పంపకాల్లో పరస్పర అంగీకారం కుదరని మంత్రుల్లా నిస్సిగ్గుగా కొట్లాడుకుంటున్నాయి.

నడి చౌరస్తాలో జరుగుతున్న ఈ తతంగాన్నంతా మానవ సంచారం అంతగాలేని అర్ధరాత్రి ప్రొఫెసర్ లీల తన బెడ్‌రూం కిటికీలోనుండి యథాలాపంగా చూస్తోంది.

రోడ్లపై పరుచుకున్న పండు వెన్నెల నియాన్‌లైట్ల కాంతి.

కాంతిలో కనిపిస్తున్న భారత దేశ పటం ముక్కలు.. ఎయిర్‌టెల్.. టెల్ ఎయిర్.. గాలీ చెప్పవే.. చెప్పవే గాలీ.. విస్తరించిన భారత దేశ నెట్‌వర్క్‌ను కుక్కలు ముక్కలు ముక్కలుగా చించేస్తున్నాయని.

లీల అవాక్కయి చూస్తూండగానే టపటపా పెద్ద పెద్ద చినుకులతో అకస్మాత్తుగా వచ్చిపడ్డ అవిశ్వాస తీర్మానంలా వర్షం మొదలై జడివానగా మారింది – కుక్కలు క్షణాల్లో పారిపోయాయి. చౌరస్తాలో ముక్కలు ముక్కలైన భారతదేశ వినైల్ హోర్డింగ్ బంగారు రంగు పీలికలు.. కురుస్తున్న ఇనుప మేకుల్లాంటి చినుకులతో వర్షం.

అంతా నిశ్శబ్దం.

కేవలం ఒట్టి వర్షం చప్పుడు

తన మూడవ అంతస్తు రోడ్డువార కిటికీనుండి చూస్తున్న ప్రొఫెసర్ లీలకు ఎందుకో కడుపంతా దేవినట్టు, కళ్ళలో నుండి ఓ సముద్రం పొంగుకొస్తున్నట్టనిపించి మౌనంగా కళ్ళు మూసుకుంది.

అప్పుడామె మనసు మంటల్లో కాలిపోతున్న కాగితంలా ఉంది.

సరిగ్గా అప్పుడే ఆమె ఎదురుగా ఉన్న గోడగడియారం ఒక గంట కొట్టింది.

***

ఒక ప్రసిద్ధ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ లీలకు ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో సిటీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నుండి టెలిఫోన్ వచ్చిన సందర్భం జ్ఞాపకమొచ్చింది.

'మేడమ్.. మేము సడెన్‌గా వన విజ్ఞాన్ పార్క్‌లో రైడ్ చేస్తే మీ కాలేజికి చెందిన ఐదుగురు అమ్మాయిలు ఎనిమిదిమంది కుర్రాళ్ళు అసభ్యకరమైన పనులు చేస్తూ పట్టుబడ్డారు మేడమ్..'' ఇంకా చెబుతూ పోతున్నాడు ఇన్‌స్పెక్టర్.

అసహ్యమేసింది...

వెంటనే ఫిజికల్ డైరెక్టర్‌ను పంపి ఫైనలియర్

రెండు సెక్షన్లపై దాడి చేయించి సెల్‌ఫోన్లను సీజ్ చేస్తే.. మొత్తం ఎనభై ఆరు హాండ్‌సెట్స్.. కాలేజికి మొబైల్స్ తేవద్దని ఎన్నోసార్లు ఖచ్చితమైన ఆదేశాలనిచ్చినా.. దొంగచాటుగా..

ఏమిటిది.?

తన గదిలోకి సీజ్ చేసిన సెల్ ఫోన్లన్నింటినీ తెప్పించి యిద్దరు సీనియర్ ప్రొఫెసర్లతో తనిఖీ చేయిస్తే.. అన్నీ బూతు ఎస్సెమ్మెస్‌లే. ఒకమ్మాయి ఒకడికి యిచ్చిన ఎస్సెమ్మెస్ 'షల్ వియ్ హావ్ కిస్ టుడే ఎట్ అమృతా థియేటర్.. ఫషో' టైం మూడుగంటల పదినిమిషాలు.. అంటే క్లాసు జరుగుతున్న సమయంలో ఇవ్వబడ్డ మెసేజ్ అది.,

యింకో పోరడు 'కమింగ్ సండే వుయ్ విల్ ప్లై టు పాకాల. గెట్ రడీ. షల్ వుయ్ హావ్ దట్..'

ఒక్కో సెల్‌ఫోన్లో బయటకు చదవలేని బూతులు.. ప్రొఫెసర్లే తలలు దించుకుంటున్నారు చదవలేక.

అందర్నీ రప్పించి తన గదిలో నిలబెడితే.. తలలు వంచుకుని.. గుంపులు గుంపులు.. అమ్మాయిలు, అబ్బాయిలు – ఈ దేశ యువత.

ఏమిటిది.? ఏమౌతోంది తరం.. ఏమిటీ స్వేచ్ఛ.. ఏమిటీ హద్దులు మీరుతున్న అతిక్రమణలు విద్యార్జన పేరుతో చాలా సలువుగా ఏర్పడుతున్న ఈ స్త్రీ పురుష సాంగత్యాలు ఎటు దారితీస్తున్నాయి. శాస్త్రాభివృద్ధి పేరుతో విస్తరిస్తున్న ఈ కమ్యూనికేషన్ సౌకర్యాలు ఈ తరాన్ని యిక ఎన్నడూ కోలుకోలేని ఊబిలోకి నెడ్తున్నాయి కదా. వీటిని ఎవరు నియంత్రించాలి. సుడిగాలిలో కాగితంముక్కలా కొట్టుకుపోయే ఉద్విగ్న యౌవనంలో ఈ బాహువులు తెరిచి పిలిచే అవకాశాలు ఈ యువతను ఏ విధ్వంసపు అంచులకు తరుముతున్నాయి.

పది రోజుల క్రితం తమ కాలేజికి చెందిన ఒక మొదటి సంవత్సరపు కుర్రాడు ఎవడో ఇంటర్ అమ్మాయిని ప్రేమించి విఫలుడై చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జ్ఞాపకమొచ్చింది లీలకు.

ఈ ప్రీమాచ్యూర్డ్ ప్రేమలేమిటి.. ఈ సినిమాలు, ఈ మీడియా, ఈ ఇంటర్నెట్ ఛానల్స్, చేయి చాపక ముందే అంటే విచ్చలవిడి సౌకర్యాలు.. హద్దుమీరుతున్న అతి స్వేచ్ఛ..

విశృంఖలత్వంగా మారుతున్న స్వతంత్రం,
ఆరాచకత్వంగా మారుతున్న రాజ్యాంగ స్వేచ్ఛ.

కొద్ది రోజుల క్రితం ఏదో పత్రికలో ఎవరో కవి రాసిన కవితా పంక్తులు స్ఫురణకొచ్చాయి లీలకు.

''అప్పుడాక్షణం
దేశంలోని సగం యువత తమ సెల్‌ఫోన్లలో సంభాషిస్తున్నారు
సగం మంది గృహిణులు టీవీ ఛానళ్ళలో సీరియల్స్ చూస్తూ కన్నీళ్ళు కారుస్తున్నారు
సగం మంది బాలలు పోగా ఛానల్స్‌లో, వీడియో గేముల్లో
సమాధియైపోయారు.
అందరూ చిత్తుగా నిద్రపోతున్న యింటిలోకి
నిర్భయంగా చొరబడ్డ దొంగల్లా
రాజకీయ నాయకులు ఈ దేశాన్ని నిర్లజ్జగా దోచుకుంటున్నారు''

భారతదేశమా వర్ధిల్లు.. భారత సమాజమా వర్ధిల్లు–

సాయంత్రం కార్లో యింటికొస్తుండగా మేనేజ్‌మెంట్ కమిటి ఛైర్మన్ ఫోన్ చేశాడు చేసి 'కంగ్రాట్స్ మేడమ్.. మనకు ఇంకో ఇంజనీరింగ్ కాలేజి శాంక్షనైంది. వెబ్‌సైట్లో చూశారా.. పాతరెండు కాలేజిల్లోని సెక్షన్లలో సీట్లను అరవై నుండి నూటా యిరవైకి ఎన్‌హాన్స్ చేశారు..!'' చెప్పుకుపోతున్నాడు.

ఏమిటీ ఇంజనీరింగ్ కాలేజిలు.. ఒక్క రాష్ట్రంలో నాల్గువందల ఏభై.. ఠాకూర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, ఠాకూర్ ఇంజనీరింగ్ కాలేజి, ఠాకూర్ ఇనిస్టిట్యూటాఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ. అఫీషియల్‌గా వేర్వేరు కాంపౌండ్‌లలో మూడు కాలేజీలు.. కాని నిజానికి అన్నీ ఒక్కచోటే.. ఒకే ప్రాంగణంలో.. యాజమాన్యాలు అలా బ్రీఫ్‌కేసుల నిండా వెయ్యి రూపాయల నోట్ల కట్టలను నింపుకుని వెళ్ళి ఢిల్లీలో, హైద్రాబాద్‌లో కార్లలోనే కూర్చుని, చెట్లక్రింద రేట్లను బ్రోకర్లకు చెల్లించి పర్మిషన్ కాగితాలను అతిసుళువుగా పట్టుకొస్తున్నారు.

ఈ దేశంలో చివరికి 'ఇచట ఏదైనా అమ్మబడును మరియు కొనబడును'. ఐపోయింది. ఇంజనీరింగ్ కాలేజికి యిన్ని లక్షలు, ఎంసిఎకి యిన్ని లక్షలు, ఎంబిఎకు యిన్ని లక్షలు, బి.ఇడికి యిన్ని లక్షలు, ఫార్మసీ కాలేజికి యింత.. అన్నీ ఫిక్స్‌డ్ రేట్లే. రహస్యం లేదు.

> **పది రోజుల క్రితం తమ కాలేజికి చెందిన ఒక మొదటి సంవత్సరపు కుర్రాడు ఎవడో ఇంటర్ అమ్మాయిని ప్రేమించి విఫలుడై చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జ్ఞాపకమొచ్చింది లీలకు.**

దాపరికం లేదు. అంతా బహిరంగమే. పే అండ్ యూజ్.. కొన్నిసార్లు యూజ్ అండ్ పే. నిస్సిగ్గుగా బాహాటంగా నడుస్తున్న విద్యా వ్యాపారం. ప్రమాణాలు, బోధనా సౌకర్యాలు, అధ్యాపక సిబ్బంది వసతులు అంతా ట్రాష్.

ఒక ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేసి.. ఈ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజికి ప్రిన్సిపాల్‌గా తను మళ్ళీ ఉద్యోగంలో చేరడమంటే.. తను కూడా ఈ దుష్ట సంస్కృతిలో భాగస్వామి ఔతున్నట్టేగదా.

గత రెండు నెలలుగా తన హృదయం కైమాకొడ్తున్న కత్తికింద మాంసపు ముద్దలా ఉంది. క్షోభ.. క్షోభ.. మౌన క్షోభ.. ఒక ఆత్మాంతరంగ వివేచన.. ప్రళయిస్తున్న కెరటాలు మళ్ళీ తిరిగి సముద్రగర్భంలోకి అభిక్రమిస్తున్న అనుభూతి.

కారు తారురోడ్డుపై గాజుగోలీలా సాగీ సాగీ వచ్చి.. బంగళాలోకి రాగానే చేసిన మొట్టమొదటి పని ఠాకూర్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్స్‌పాల్ పదవికి, నెలకు లక్ష రూపాయల ఉద్యోగానికి రాజీనామా చేయడం. లేఖను ఛైర్మన్‌కు పంపడం.

మరుక్షణం.. పంజరంలోనుండి బయటపడి ఆకాశంలోకి ఎగిరిన పావురం పొందే అమృతానుభూతి రెండు బాహువులూ విశ్వవ్యాప్తమౌతూ విస్తరిస్తున్నట్టు మహదానందం.

ఇక తాను ఏదో ఒకటి చేయాలి.

ముప్పది ఆరు సంవత్సరాలు.. చదువుకోవడం.. చదివి నేర్పడం.. మళ్ళీచదివి.. నేర్చుకోవడం.. బోధించడం. అధ్యాపకుడంటే ఒక తరాన్ని తయారు చేసే మహామనీషి – అదీ తన నిర్వచనం.

ఈ వర్తమాన నీతిహీన సామాజిక చట్రంలో తను యిమడలేదు.

ఇక ఏదో ఒకటి తప్పకుండా చేయాలి తను–

***

వర్షాకాలమొచ్చింది కాని వర్షం రాలేదు.

లీల అసహనంగా బెడ్‌రూం బయట. లాంజ్‌లో పచార్లుచేస్తోంది.

ఇంతకు ముందటి కుక్కలు భారతదేశ పటాన్ని ముక్కలు ముక్కలుగా చింపడం మనసు నిండా విషాదాన్ని నింపింది.

ఒక్క కుక్కలేనా.. నీతిహీనులైన రాజకీయ నాయకులందరూ కుక్కలకంటే హీనంగా ఈ దేశాన్ని పీక్కుతింటున్నారు. సంకీర్ణ ప్రభుత్వాల పేర్లతో నైతిక హీనమైన పొత్తులు. తల చెల్లెలు, మిగతా శరీరం మరదలు.. ఛీఛీ..

జనం చూస్తున్నారు.. రేచుకుక్కల వలె. పంజా విప్పిన పులులవలె, గర్జించే సింహాలవలె.

ఓట్లకోసం దేశాన్ని కుదువబెట్టే నపుంసక రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు.

ఎవడిమ్మాన్నాడు రెండ్రూపాయలకు కిలో బియ్యాన్ని.

ఎవడిమ్మాన్నాడు ఉచిత విద్యుత్తును. కలర్ టివిలను.

ఎవడిమ్మాన్నాడు రాజ్యాంగం ప్రతిపాదించని రిజర్వేషన్‌లను.

ఎవడిమ్మాన్నాడు ఈ దిక్కుమాలిన అడగని వరాలను

ఎవడు చేయమన్నాడీ ప్రజలను బిచ్చగాళ్ళుగా, సోమరిపోతులుగా, పనిదొంగలుగా..ఎక్కడిదీ డబ్బు.. ఈ లక్షల కోట్ల ప్రజల డబ్బును దుర్వినియోగపర్చే అధికారమెవ్వడిచ్చాడీ రాజకీయ అర్భకులకు.

ఈ అనుచితమైన 'ఉచితాల'నిచ్చి ఈ దేశప్రజలను దద్దమ్మలుగా, వెధవలుగా, తాగుబోతులుగా మార్చి ఈ దేశ భవిష్యత్తును పేడితరానికి అప్పగించే హక్కు ఎవడిచ్చాడీ పాలకులకు.

మరోవైపు యువతరాన్ని ఐఐటి ఎన్నుగా, దిక్కుమాలిన ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజిల నుండి వెలువడే 'హ్యూమన్ గార్బేజ్'గా ప్రభుత్వాలే వర్గీకరించి తెలివిగల క్రీమ్‌ను 'అమెరికాకు అమ్మి, ఒట్టి చెత్తను యిక్కడి రోడ్లపై నింపి,

అంతా స్వార్థం.. అంతా స్వలాభాపేక్ష.. అంతా స్వక్షేమం, స్వంత వృద్ధి.

తన తర్వాత తన కొడుకు ప్రధానమంత్రి.. తన తర్వాత తన కొడుకు ముఖ్యమంత్రి. తన తర్వాత తన బామ్మర్ది ఎమ్‌పి. తన తర్వాత తన సెకండ్ లేడీ రాజ్యసభ సభ్యురాలు. ఈ వారసత్వ రాజకీయ దౌర్జన్యాల కింద ఎన్ని తరాలు.. ఎన్ని దశాబ్దాలు నలిగిపోవాలి.

జెండా మోస్తున్నవాడు చీకట్లో, బురదలో, ఎన్నడూ తెల్లవారని అంధకారంలో మగ్గిపోతూ.. ఎన్నాళ్లిలా.

జనం ఎప్పుడు గ్రహిస్తారో ఈ అప్రత్యక్ష దోపిడిని.

రాజకీయాలు, సినిమాలు, వ్యాపారాలు, మాఫియాలు, ఉద్యమాలు అన్నీ ఈ కుటుంబ వారసత్వ సంక్రమణలో, కుల వర్గ వర్ణ అంతర్కలహాలతో.. ఎలా..

ప్రజలు గొర్రెలవలె, బర్రెలవలె తలవంచుకుపోయే పశువుల వలె.. ఎన్నాళ్ళిలా.. ఇప్పుడిక ఎవరు ఈ ప్రజలను విద్యావంతులను చేయాలి. ప్రజలను నిద్రలేపాలి. వేలకొద్ది మద్యం దుకాణాల మత్తులో నిర్వీర్యం చేయబడ్తున్న యువతను చైతన్యవంతం చేయాలి.

మరో స్వాతంత్ర్యపోరాటం నిర్మించబడాలి.

పూర్తిగా స్పృహతప్పిపోకముందే ఈ తరాన్ని మళ్ళీ జాగృతం చేయాలి.

కాని ఎలా.. ఎవరు చేపట్టాలీ బృహత్ కార్యక్రమాన్ని ఎవరు పూరించాలీ యుద్ధశంఖాన్ని. ఎవరు ఈ తరాన్ని తట్టిలేపే వైతాళిక బాధ్యతను చేపట్టాలి.

లీల తలెత్తి ఎదురుగా ఉన్న గోడవైపు చూసింది.

గోడపై పోలీసాఫీసర్ యూనిఫాంలో డిఐజి ఐన తన భర్త రవిప్రకాశ్ ఐపిఎస్ ఫోటో

తన శోభనం రాత్రే గ్రహించింది, తన భర్త అధికార దర్పంతో ఈ దేశాన్ని భోంచేసే రాక్షసుడని. ఈ దేశంలో యాభైశాతం ఐఎఎస్‌లు, ఐపిఎస్‌ల వల్లే జాతీయ వనరుల్లో ఇరవైఐదు శాతం నిశ్శబ్ద విధ్వంసం జరుగుతోందని.

సింపుల్ ఫార్ములా.. ఒక ఐఎఎస్ ఆఫీసర్ నెల జీతమెంత వాని ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ ఏం చెబుతున్నాయి. వాడి ప్రస్తుత నికర ఆస్తుల విలువెంత.. ఒక్కసారి కరవాలమెత్తగలిగితే.. అంతా మరుక్షణం తుత్తునియలు. కాని కరవాలమెత్తగలిగే ధీరుడేడి. నీతివంతుడేడి. రేపటి ఈ దేశ ఆశాజ్యోతి ఏది?

రవిప్రకాశ్ అను తన భర్తకు కోట్ల ఆస్తి.. ఎందరో ఉంపుడుగత్తెలు.. ఎందరో ప్రియురాండ్రు.. ఎందరో వందిమాగధులు. ప్రతిరాత్రీ వసంతరాత్రి.

ఐతే ఈ దుర్మార్గభర్తతో నీతిహీనమైన వృశ్చిక సంతానం కనకుండా అని అనార్ద్ర జీవితాన్ని గడుపుతూ దూరంగా ఉండడం తను తనకు తానుగా ఈ సమాజం కోసం చేసిన మేలు.

యథావిధిగా.. అతను రాత్రుళ్ళు తన దగ్గరకు రాడు.. అందువల్ల ఈ రోజుకూడా లేడు.

జీవితం ఒక కాకి బంగారపు కాగితం.

మెరిసే రజతకాంతులు.. మిథ్యా విలువలు.. ఉండీ లేనట్టు.. లేకా ఉన్నట్టు.

***

ప్రొఫెసర్ లీల సాయంకాలం నుండి అసంకల్పితంగానే తను తయారుచేసిన ఒక మాడల్‌వైపు చూస్తూ నిలబడ్డది.

నిన్న ఒక కొత్త కుండను కొన్నది తను. కొన్ని కొబ్బరి తాళ్ళను కూడా సేకరించింది. తనకు తెలియకుండానే తాను వాటిని ఉపయోగించి.. ఒక నీటి కుళాయి దగ్గర అమర్చింది.

కుండకు చుట్టూ రంధ్రాలు. అడుగు పూర్తిగా లేదు. దాని మెడలో కొబ్బరి తాడును కట్టి కుళాయి మూతికి అమర్చింది. కింద ఖాళీ బకెట్. కుళాయిని పూర్తిగా విప్పితే.. ఉధృతంగా వస్తున్న నీళ్ళు చుట్టూ రంధ్రాలుండీ అడుగే లేని కుండలో ఒక్క బొట్టు కూడా పడకుండా నేరుగా బకెట్‌లో పడ్తున్నాయి.

కుళాయిపై ఉన్న ట్యాగ్‌పై 'ఈ దేశ ఆర్థిక వనరులు, కొత్తకుండపై భారతదేశం, ప్రజలు., కింది బకెట్‌పై దళారీలు, రాజకీయ నాయకులు, మాఫియాలు' అని రాసింది.


నీళ్ళు అనబడే వనరులు ప్రవహిస్తూనే ఉంటాయి నిరంతరంగా. అడుగేలేని కుండ అనబడే ఈ దేశ అవసరాలు ఎప్పుడూ నిండవు. సర్వసంపదలనూ ఈ దేశపు నీతిహీన రాజకీయ, మాఫియా వర్గాలు భుజిస్తూనే ఉంటాయి.

ప్రజాకర్షక పథకాలతో, మితిమీరిన జనాన్ని నిద్రబుచ్చే సబ్సిడీ పరికల్పనలతో కుల, మత, వర్గ, వర్ణ విబేధాల పోషణతో ఈ దేశ ఆర్థిక వ్యవస్థంతా ఎప్పుడో చిన్నాభిన్నమై అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉంది.

ప్రస్తుతం ప్రతి పౌరుని తలపై వాడికే తెలియని అప్పు.

ఇప్పుడెలా.?

కావాలనే ప్రభుత్వాలచే వడ్డించబడ్తున్న విషపు మత్తుమందును తిని సొమ్మసిల్లిన ఈ ప్రజావ్యవస్థను ఎలా మేల్కొల్పాలి. కుంభకర్ణ నిద్రనుండి జాగృతం చేయగలిగే ఢంకానాదాన్ని, సింహగర్జననూ ఎవరు సృష్టించాలి.



ప్రొఫెసర్ లీల ఎంతో ఉద్విగ్నంగా ఉంది.

ముప్పది ఆరేళ్ళుగా తను తయారు చేసిన శిష్యుల పరంపరను ఆమె మనస్సు స్కాన్ చేస్తూ వస్తోంది వేగంగా. ఆత్మ ఒక అద్భుతమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది.

పవిత్రమైన లక్ష్యం ఎప్పుడూ త్యాగాన్ని కోరుతుంది.

సంసిద్ధురాలౌతోందామె.. ఒక భవిష్యత్ యుద్ధానికి ..ఎవరికోసమో నిరీక్షణ అనవసరం.. తనే చేయాలి ఏదో ఒకటి-

టేబుల్ సొరుగులోనుండి బ్యాంక్ పాస్‌బుక్స్‌ను తీసుకుని వెతికింది. ఇల్లూ, కారూ, నగదూ.. అన్నీ కలిపి డెబ్బది ఆరు లక్షల రూపాయల విలువ. కాగితాలను బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకుంది.

చకచకా లాప్‌టాప్‌ను తెరిచి సిస్టంను బూట్ చూస్తుండగా బయట కుండపోతగా వర్షం ఆరంభమైంది.

ఇ-మెయిల్ రాయడం ప్రారంభించింది లీల.

ప్రియమైన శిష్యులారా, మనం ఈ దేశం కోసమే జీవించవలసిన చారిత్రాత్మకమైన అవశ్యకత ఇప్పుడేర్పడింది. మీకు తల్లివంటి గురువునైన నేను ఆదేశిస్తున్నాను. వచ్చే నెల రెండవ తేదీన మనం వరంగల్ రైల్వేస్టేషన్ ఒకటవ నంబర్ ప్లాట్‌ఫాంపై గల రెండవ తరగతి వేచి ఉండు గదిలో రాత్రి తొమ్మిది గంటలకు కలుసుకోబోతున్నాం.

పూర్తిగా ధ్వంసమైపోతున్న ఈ దేశాన్ని పునర్నిర్మించేందుకు నేను అనేక మార్గాలను అన్వేషించాను. ఎప్పుడు మనిషిని పంచభూతాలూ, ఒక దేశాన్ని మనిషే రక్షిస్తూవస్తున్నాడు.

యిప్పుడు ఒక 'అడవి' మాత్రమే మనకు మార్గదర్శనం చేయగలదు. యుగయుగాలుగా వ్యాసాది ఋషులనుండి యిప్పటి గిరిజన వీరుల వరకు అరణ్యమే అందరినీ అమ్మయి ఆదుకుంది.

అడవే గురువు, అడవే ప్రేరణ, అడవే ఆత్మ

మనం కూడా ఈ దేశ భవిష్యత్ పరిష్కారం కోసం 'అడవి'లోకి అంతర్ధానం కావలసి ఉంది.

తెలివిగలవాడు అవకాశాలను ఉపయోగించుకుంటాడు

సాహసి అవకాశాలను రూపొందించుకుంటాడు.

సాహసులైన మీరైదుగురు త్వరలో నాకు తప్పకుండా కలుస్తున్నారు. అంతే -

ఇట్లు
లీల

కాపీ ఫార్వార్డెడ్‌టు

కిషన్ చందర్, ఐఐటి కాన్పూర్-ప్రతాప్ సింగ్, ఐఐటి ఢిల్లీ-కిశోర్ సిన్హా, ఐఐఎమ్ బెంగళూరు-సదానంద, ఇస్రో శ్రీహరికోట-రాణా, విఎస్‌పి, విశాఖపట్నం.

అన్ని ఇ-మెయిల్స్ 'సెంట్' రిపోర్ట్ రాగానే,

ప్రొఫెసర్ లీల కుర్చీలో వెనక్కి వాలి తృప్తిగా నిట్టూర్చింది.

'అస్తమించిన సూర్యుడు ఉదయించడనుకోవడం నిరాశ' అని ప్రజాకవి కాళోజీ చెప్పిన అద్భుతమైన విషయం జ్ఞాపకమొచ్చిందామెకు.. ఎందుకో

అప్పుడామె హృదయం సముద్రాలను మోస్తున్న భూమిలా మార్మికంగా ఉంది.

బయట లయబద్ధంగా వర్షపు చినుకుల చప్పుడు

.. ఒక తృప్తి

యిప్పుడిక తను ఈ దేశంకోసం అవినీతిపరులైన ఈ దేశ ప్రజలతోనే, దేశ ద్రోహులతోనే ఒక అంతర్యుద్ధం చేయవలసి ఉంది.

అనివార్యమైనప్పుడు దేహరక్షణ కోసం దుష్టాంగ నిర్మూలన తప్పదు కదా-

*